ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
సోమవారం 6 అక్టోబరు 2025


ఎక్స్‌కవేటర్‌తో ఇసుక లోడుతున్న దృశ్యం

రైల్వేకోడూరు టు బెంగళూరు

- రోజూ వందల టిప్పర్లలో అక్రమంగా తరలింపు
- తరలిపోతున్న ఇసుక
- ఎవరి మామూళ్లు వాళ్లకే


పెనగలూరు మండల పరిధిలోని రీచ్‌లో కుప్పగా పోసిన ఇసుక


రీచ్‌లో టిప్పర్లు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి రోజూ వందలాది టిప్పర్లలో ఇసుక బెంగళూరుకు తరలిపోతోంది. పలు శాఖల అధికారుల సంపూర్ణ సహకారంతో యథేచ్ఛగా ఈ ఇసుక అక్రమ దందా కొనసాగుతోంది. ప్రభుత్వం అధికారికంగా కేటాయించిన ఇసుక రీచ్‌లు, అనధికార ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తరలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను గాలికొదిలేసి ఎక్స్‌కవేటర్లతో ఇసుకను తోడేస్తున్నారు. ఈ అక్రమ దందా వెనుక నియోజకవర్గ టీడీపీ ముఖ్యనాయకులే ఉండడం గమనార్హం. దీంతో అధికారులు అటు రీచ్‌లవైపు.. ఇటు ఓవర్ లోడుతో వెళుతున్న ఇసుక టిప్పర్ల వైపూ కన్నెత్తి చూడడం లేదు. ఇలా ఎవరూ అడ్డు చెప్పే వాళ్లు.. అడిగే వాళ్లు లేకపోవడంతో రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఇసుక అక్రమ దందా.. మూడు ఎక్స్‌కవేటర్లు.. ఆరు టిప్పర్లు అనే రీతిలో సాగుతోంది.

గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇసుకను పేదలకు అందకుండా చేశారు. డబ్బున్న వాళ్లకే ఇసుక అనే స్థాయిలో ఇసుకతో వ్యాపారం చేశారు. ఈ ఇసుక దందాలో పలువురు వైసీపీ ముఖ్య నాయకులు కోట్లాది రూపాయలు సంపాదించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇసుకను పేదలకు సైతం అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రజలందరికీ ఉచిత ఇసుకను ప్రకటించింది. అయితే ప్రభుత్వ లక్ష్యానికి కొందరు టీడీపీ నాయకులు తూట్లు పొడుస్తూ ఉచిత ఇసుకను తమ ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారు.


ఇసుక రీచ్‌లో టిప్పర్ల కోసం రోడ్డు వేస్తున్న దృశ్యం

తమ అధికారాన్ని అడ్డు పెట్టుకుని అధికారులపై ఒత్తిడి తెచ్చి, కొన్నిచోట్ల అధికారులకు మామూళ్ల రుచిమరిపించి తమ అక్రమ ఇసుక దందాను కొనసాగిస్తున్నారు.

రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు మండల పరిధిలో చెయ్యేరు నదిపైన రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నారాయణనెల్లూరు ఇసుక రీచ్, కోమంతరాజపురం ఇసుక రీచ్‌లను కేటాయించింది. ఈ రీచ్‌ల నుంచి ప్రజలకు అవసరమైన ఇసుకను సరఫరా చేస్తారు. అయితే ఇక్కడ పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక స్లిప్పుతోనే రెండు అంతకు మించి టిప్పర్లు ఇసుకను తరలిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు ప్రభుత్వం కేటాయించిన ఇసుక రీచ్‌లలో కేవలం మనుషుల ద్వారానే ఇసుక తవ్వి టిప్పర్లకు నింపాలి. అయితే ఇక్కడ ఎక్స్‌కవేటర్‌లతో ఇసుకను తవ్వుతున్నారు. ఇవే కాకుండా ఇక్కడే కొన్ని అనధికార ఇసుక రీచ్‌లు కూడా నడుస్తున్నాయి. ఇక్కడ ఇష్టారీతిగా ఇసుకను తవ్వేస్తున్నారు. ఈ ఇసుక నింపుకున్న టిప్పర్లు తిరుపతికి అక్కడి నుంచి బెంగళూరుకు తరలిపోతున్నాయి. ఇలా రోజుకు వందలాది టిప్పర్లలలో ఇసుక అక్రమంగా తరలిపోతోంది. నాయకుల జేబులు నింపుతోంది. ఇదే పరిస్థితి రాజంపేట నియోజకవర్గం పరిధిలోని బాలరాజుపల్లె ఇసుక రీచ్‌లోనూ జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడి నుంచి రోజూ వందలాది టిప్పర్లు సానిపాయి ఘాట్, సుండుపల్లె, కేవీ పల్లె మండలం మీదుగా మదనపల్లె, బెంగళూరుకు తరలుతున్నాయి.

ట్రాక్టర్లతోనూ యథేచ్ఛగా దోపిడీ

సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ట్రాక్టర్ల ద్వారా ఎవరైనా ఇసుకను తరలించుకునే అవకాశాన్ని కల్పించింది. అయితే పలువురు ట్రాక్టర్ల యజమానులు దీనిని అలుసుగా తీసుకుని ట్రాక్టర్లతో స్థానికంగా ఇసుకను తవ్వుకుని ఒకచోట నిల్వ చేసుకుని టిప్పర్ యజమానులకు అమ్ముకుంటున్నట్లు సమాచారం. రైల్వేకోడూరు నియోజకవర్గంతో పాటు రాజంపేటలోని చెయ్యేరు నదిలో పలు అనధికార రీచ్‌ల వద్ద వందలాది ట్రాక్టర్లు రోజూ ఇదే పనిలో ఉంటున్నట్లు తెలుస్తోంది.

దారి పొడవునా.. ఎవరి మామూళ్లు వాళ్లవే

అక్రమంగా తరలిపోతున్న టిప్పర్లు ఎటువంటి అడ్డంకులూ లేకుండా వెళ్లడం వెనుక.. నిరంతర మామూళ్ల వ్యవహారం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇసుక రీచ్‌లు దాటి రోడ్డుపైకి వచ్చిన టిప్పర్లు ప్రధాన రహదారి మీదుగానే తిరుపతికి వెళతాయి. ఈ మార్గంలో తగిలే ప్రతి మండలంలోనూ.. రెవెన్యూ, పోలీసు, ఆర్టీవో అధికారులకు మామూళ్లు చేరుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పైన పేర్కొన్న శాఖలలోని కొందరు అధికారులకు నెలకు కనీసం రూ.50 వేలు తగ్గకుండా మామూళ్లు అందుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇదే పరిస్థితి మన రాష్ట్ర సరిహద్దు దాటేంత వరకు సాగుతున్నట్లు సమాచారం. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ ఇసుక దందాకు ఫుల్‌స్టాప్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.

రెడ్డెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సంతాన లక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళ భరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆలయంలో వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కు తీర్చుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి రావడంతో పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కారం వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మునిగోపాలకృష్ణకు రాష్ట్ర స్థాయి ఉత్తమ సీనియర్ సిటిజన్ అవార్డు


గుంటూరులో అవార్డు అందుకున్న సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ

మదనపల్లె అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మునిగోపాలకృష్ణకు రాష్ట్ర స్థాయి ఉత్తమ సీనియర్ సిటిజన్ అవార్డు అందజేశారు. గుంటూరు పట్టణంలోని శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏపీ ప్రభుత్వం తరపున రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఈయను సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర స్థాయి అవార్డు ప్రధానం చేశారు. ఇందులో ఎమ్మెల్యే గల్లా మాధవి, ఏపీ స్టేట్ డైరెక్టర్ రవిప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి, గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణస్వామి, పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మునిరత్నం, ప్రొఫెసర్ శ్రీనివాసులు, టీఏఎస్ కృష్ణమూర్తి, జగన్‌మోహన్, ఎన్‌వీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు రెండు రాష్ట్ర స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు

- జిల్లాకు 49 అవార్డులు

రాయచోటి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు జిల్లాకు రెండు దక్కాయి. స్వచ్ఛ వసతి గృహాలు విభాగంలో ఈ అవార్డులు వచ్చాయి. పుల్లంపేటలోని బాలుర సమీకృత వసతి గృహం, రాజంపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణానికి ఈ అవార్డులు దక్కాయి. బెస్ట్ గ్రీన్ అంబాసిడర్, బెస్ట్ స్వచ్ఛ ఎన్‌జీవోలు, బెస్ట్ స్వచ్ఛ వారియర్స్, స్వచ్ఛ అంగన్‌వాడీలు, స్వచ్ఛ బస్టాండులు, బెస్ట్ గవర్నమెంటు ఆఫీసులు, బెస్ట్ గ్రామ పంచాయతీలు, స్వచ్ఛ హాస్పిటల్స్, స్వచ్ఛ ఇండస్ట్రీస్, స్వచ్ఛ మున్సిపాలిటీస్, స్వచ్ఛ రెసిడెన్సియల్ స్కూల్స్, స్వచ్ఛ రైతు బజార్స్, స్వచ్ఛ స్కూల్స్ వంటి అనేక విభాగాలలో జిల్లా స్థాయిలో 49 అవార్డులు ప్రకటించారు. జిల్లా స్థాయిలో అవార్డులను రాయచోటిలోని సుధా ఈవెంట్స్ ఫంక్షన్ హాలులో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే సభలో అందచేయనున్నారు.

వైభవంగా పవిత్రాల సమర్పణ



పవిత్రోత్సవాలలో కలశ స్థాపనకు ప్రదక్షిణగా తీసుకెళ్తున్న అర్చకులు, పవిత్రాలకు విశేషాలంకరణలతో పూజలు

- వేడుకగా స్నపన తిరుమంజనం

వాల్మీకిపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభి రామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో పవిత్ర మహోత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ మండపంలో కలశ స్థాపన చేసి పవిత్రాలను సమర్పించి విశేష పూజలు, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీతారామలక్ష్మణులకు స్నపన తిరుమంజనం వేడుకగా సాగింది. చివరగా యాగశాల కైంకర్యాలు పూర్తి చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిబాల, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, బాషికాచార్యులు, కృష్ణరాజుభట్టార్, గోకుల్, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువురిని బలిగొన్న నీటికుంట

- ప్రమాదవశాత్తు పడి ఇద్దరు బాలుర మృతి


ప్రమాదానికి కారణమైన నల్లరాళ్లఒడ్డుకుంట


మృతి చెందిన మోక్షిత్‌నాయుడు, లిఖిత్‌నాయుడు

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మాయదారికుంట ఇరువురిని పొట్టన పెట్టుకున్న సంఘటన సంబేపల్లె మండలం రెడ్డివారిపల్లె గ్రామం నడిమిరాజుగారిపల్లెలో జరిగింది. సరదాగా ఆడుకుంటూ నల్లరాళ్లఒడ్డుకుంటలో పడి పైడి మోక్షిత్ నాయుడు (13), ముల్లగూర లిఖిత్ నాయుడు (11) మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు... మదనపల్లికి చెందిన మోక్షిత్‌నాయుడు దసరా సెలవులకు సంబేపల్లె మండలం రెడ్డివారిపల్లి గ్రామం నడిమిరాజుగారిపల్లెకు చెందిన బాబాయ్ జనార్దన్ నాయుడు ఇంటికి వచ్చాడు. జనార్దన్‌నాయుడు కుమారుడు లిఖిత్‌నాయుడు, మోక్షిత్ నాయుడు ఇరువురు ఆదివారం ఉదయం ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందినట్లు తెలిపారు. లిఖిత్ తిరుపతిలోని శ్రీచైతన్య స్కూల్‌లో 6వ తరగతి, మోక్షిత్ మదనపల్లి భాష్యం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నట్లు తెలిపారు. మృతి చెందిన ఇరువురు అక్కాచెల్లెళ్ల పిల్లలని, దసరా సెలవుల కోసం వచ్చి మృతి చెందినట్లు బంధువులు భోరున విలపించారు. మృతదేహాలను కుంటలో నుంచి బయట తీయగా మోక్షిత్ ప్రాణాలతో ఉన్నట్లు గమనించి రాయచోటికి తరలిస్తుండగా మృతి చెందాడు. సంఘటన స్థలానికి రూరల్ సీఐ వరప్రసాద్, ఏఎస్ఐ బాదుల్లా వెళ్లి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను వారి కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు.

ఇరువురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్


- రూ.30 లక్షల విలువ గల బంగారు, వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్


మీడియా సమావేశంలో చోరీ కేసుల్లో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటిటౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లో వరుసగా జరిగిన చోరీ కేసుల్లో ఇరువురు నిందితులను శని, ఆదివారాల్లో పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.30 లక్షల విలువ గల బంగారం, వెండి నగలతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో డీఎస్పీ కృష్ణమోహన్ వివరాలు తెలిపారు. కడప పట్టణం అంగడివీధికి చెందిన షేక్ నౌమాన్ మస్తాన్ అనే వ్యక్తి పెయింట్ పనిచేసుకుంటూ రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడేవాడు. ఇతడిపై రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయి. అంతేగాక ప్రొద్దుటూరు వన్‌టౌన్, టూటౌన్, ఎర్రగుంట్ల, మైదుకూరు, జమ్మలమడుగు, ఖాజీపేట పోలీస్‌స్టేషన్‌లతో పాటు కర్నూలు జిల్లా బనగానపల్లి తదితర పోలీస్‌స్టేషన్లలో 9 దొంగతనం కేసులు నమోదు కాగా ప్రస్తుతం కడప జిల్లాలో మరో మూడు ప్రాంతాల్లో తాజాగా చోరీకి పాల్పడినట్లు తెలిపారు. షేక్ నౌమాస్ అలియాస్ మస్తాన్‌ను శనివారం రాత్రి రాయచోటి పోలీసులు అరెస్టు చేసి అతడి వద్ద నుంచి రూ.21 లక్షల 30 వేల విలువ గల 375 గ్రాముల బంగారం, వెండి నగలతో పాటు ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే హైదరాబాదుకు చెందిన ప్రస్తుతం కడప పట్టణం మోచంపేటలో నివాసం ఉంటున్న మహమ్మద్‌షాఅలీజబ్రి అలియాస్ షేక్ మహమ్మద్ రెహమాన్, అలియాస్ అబ్దుల్లా, అలియాస్ సోహెల్ అనే యువకుడు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడేవాడు. చెన్నూరు, రాయచోటి పట్టణాల్లో పలువురి మహిళల మెడలో బంగారు గొలుసుల చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఇతడిపై ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 175కుపైగా కేసులు నమోదైనట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. ఆదివారం ఉదయం నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.9 లక్షల 50 వేల విలువ గల 95 గ్రాముల మూడు తాళిబొట్టు చైన్‌లను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపెట్టినట్లు డీఎస్పీ వివరించారు. నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి, ఎస్ఐలు బాలకృష్ణ, అబ్దుల్‌జహీర్, సీసీఎస్ ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది అమర్‌నాథ్, బాబ్జీ, రామకృష్ణ, సురేంద్ర, సీసీఎస్ సిబ్బంది బర్కత్, మహేంద్రలను రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ ప్రత్యేకంగా అభినందించారు.

తంబళ్లపల్లెలో 'డైరీ' ప్రకంపనలు

- డైరీలో ఉన్న 78 మంది పేర్లు ఎవరివని సర్వత్రా చర్చ
- బెల్ట్‌షాపులపై కొనసాగుతున్న దాడులు
- పార్టీ నుంచి జయచంద్రారెడ్డి, కట్టా సురేంద్రనాయుడు సస్పెన్షన్


ములకలచెరువు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్


పెద్దతిప్పసముద్రంలో స్వాధీనం చేసుకున్న బీరు, నకిలీ మద్యం బాటిళ్లు

రాయచోటి/ములకలచెరువు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు కేంద్రంగా జరుగుతున్న నకిలీ మద్యం తయారీ గుట్టురట్టు కావడం... ఎక్సైజ్ ఉన్నతాధికారులు జరిపిన మెరుపు దాడుల్లో దొరికిన డైరీ (నకిలీ మద్యం సరఫరా చేసిన వ్యక్తుల పేర్ల పుస్తకం) ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎక్సైజ్ ఉన్నతాధికారులకు దొరికిన డైరీ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటకు తీసుకురావడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. డైరీలో ఉన్న 78 మంది పేర్లు ఎవరివన్నది నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నకిలీ మద్యం కేసులో పట్టుబడ్డ నిందితులైన 10 మందిని ఎక్సైజ్ అధికారులు శనివారం రాత్రి తంబళ్లపల్లె జడ్జి ముందు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించారు. దీంతో నిందితులను ఆదివారం తెల్లవారుజామున మదనపల్లె సబ్ జైలుకు తరలించారు. కాగా కేసులో ప్రధాన నిందితుడైన జనార్దన్‌రావు అలియాస్ జానీ, రాజేశ్‌లను అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.

జయచంద్రారెడ్డి సస్పెన్షన్

తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ దాసరిపల్లె జయచంద్రారెడ్డిని తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఆదివారం రాత్రి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనతో పాటు మద్యం కేసులో అరెస్టు అయిన టీడీపీ నాయకుడు కట్టా సురేంద్రనాయుడును కూడా సస్పెండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన నకిలీ మద్యం తయారీ వ్యవహారంపై పార్టీ అధిష్టానం తీవ్రంగా స్పందించింది.

ములకలచెరువులోనే డిప్యూటీ కమిషనర్

ములకలచెరువు కల్తీ మద్యం వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారడంతో మిగిలిన నిందితులను పట్టుకునేందుకు, కేసు పురోగతి కోసం కడప ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా ఈఎస్ మధుసూదన్‌లు ములకలచెరువులోనే మకాం చేశారు. బృందాలుగా ఏర్పడి వారే స్వయంగా బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహిస్తున్నారు.

రాజేశ్ మద్యం దుకాణం సీజ్

తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్ పేరిట లైసెన్సు ఉన్న రాక్‌స్టార్ వైన్స్‌ను ఆదివారం రాత్రి ఎక్సైజ్ ఉన్నతాధికారులు సీజ్ చేశారు. బెల్ట్ షాపులకు కల్తీ మద్యం సరఫరా చేస్తున్న వాహనం రాజేష్ పేరిట ఉండడం, అతడిపై కేసు నమోదు కావడంతో అతడి పేరిట ఉన్న రాక్‌స్టార్ మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ ఈఎస్ మధుసూదన్ సమక్షంలో సీఐ హిమబిందు సీజ్ చేశారు.

బెల్ట్‌షాపులపై విస్తృత దాడులు

ఎక్సైజ్ ఉన్నతాధికారులు ములకలచెరువు, పెద్దమండ్యం, బి.కొత్తకోట, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె మండలాల్లో బెల్ట్ షాపులపై ఆదివారం విస్తృత దాడులు చేయడంతో పాటు వైన్ షాపులను కూడా తనిఖీ చేశారు. పెద్దతిప్పసముద్రం మండలం మల్లెల బెల్ట్‌షాపు, కమ్మవారిపల్లె సమీపంలోని టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడు దానిమ్మ తోటలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు కేసుల 35 బీరు బాటిళ్లు, 48 నకిలీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే సోంపల్లెలో ఎస్ఐ నరసింహుడు దాడులు నిర్వహించి 46 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోంపల్లెకు చెందిన రాయపు రామచంద్రను అరెస్టు చేశారు. అలాగే పలుచోట్ల ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. అధిక మంది బెల్ట్‌షాపు నిర్వాహకులు గ్రామాలు విడిచి వెళ్లినట్లు సమాచారం.

రెడ్డివారిపల్లె ప్రగతికి రాజకీయ గ్రహణం!

● గుండాలపల్లెను పంచాయతీ ఏర్పాటు వివాదం కోర్టు ముందుకు.. ● నిలిచిపోయిన ఎన్నికలు ● ఆగిన అభివృద్ధి

రైల్వేకోడూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలం లోని రెడ్డివారిపల్లె పంచాయతీ ప్రగతికి రాజకీయ గ్రహణం పట్టింది. పంచాయతీ పరిధిలో ఉన్న గుండాలపల్లెను విడదీసి గాంధీనగర్‌ను కలుపుతూ ప్రత్యేక పంచాయతీగా చేయడంతో వ్యవహారం కోర్టు దాకా వెళ్లింది. దీంతో 2021లో రెడ్డివారిపల్లె, గుండాలపల్లె పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు. దీంతో ఐదేళ్లుగా అభివృద్ధి కుంటుపడింది. పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. రెడ్డివారిపల్లె పంచాయతీలో గుర్రపాళెం, పాటిమీదిపాళెం, పిల్లగుట్టకాలనీ, చలంపాళెం గిరిజన గ్రామాలతో పాటు గుండాలపల్లె, గాంధీనగర్, కేసీ అగ్రహారం, దళితవాడ, అరుంధతివాడ ఉండగా 4560 మంది జనాబా, 3218 మంది ఓటర్లు ఉన్నారు. మండలంలో గ్రామ పంచాయతీలను పెంచడంలో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం రెడ్డివారిపల్లె పంచాయతీ నుంచి గుండాలపల్లెను వేరు చేయడంతోపాటు, గాంధీనగర్‌తో కలిపి కొత్త పంచాయతీ ఏర్పాటు చేసింది. ఈ చర్యను వ్యతిరేకిస్తూ కొందరు కోర్టుకు వెళ్లడంతో గతంలో పంచాయతీ ఎన్నికలు నిలిచిపోయాయి. ఇది ఇలా ఉండగా రెడ్డివారిపల్లె పంచాయతీలో వైసీపీ హయాంలో 2023లో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు రూ. 35 లక్షలు మంజూరు చేసి, 2024 ఆఖరులో ప్రారంభించిన పనులు ఆ తర్వాత అర్ధాంతరంగా ఆగిపోయాయి. ప్రస్తుతం రెడ్డివారిపల్లెలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై మురుగు ప్రవహిస్తుండడంతో దోమలు విజృంభిస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ఇంటికి సమీపం, గంగమ్మ దేవాలయంతో పాటు పలు వీధులు



రెడ్డివారిపల్లె గ్రామం (ఇన్‌సెట్) గంగమ్మ దేవాలయం సమీపంలో నిలిచిన మురుగునీరు

దుర్గంధం వెదజల్లుతున్నాయి. గుండాపల్లెలో వర్షం వస్తే నీరు వెళ్లే సౌకర్యం లేదు. రోడ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. గాంధీ నగర్ ప్రతి ఏటా వర్షాలకు కోతకు గురవుతోంది. గుండాపపల్లె ప్రత్యేక పంచాయతీ కావాలని 99 శాతం ప్రజలు కోరుకుంటున్నారని ఆ గ్రామ ప్రజలు చెబుతున్నారు. కాగా, గత ప్రభుత్వంలో రెడ్డివారిపల్లె పంచాయతీ లో రోడ్ల పైన నీరు నిలువకుండా పైపులు ఏర్పాటు చేస్తామని, ఇందు కోసం మండల నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుందని రైల్వేకోడూరు పంచాయతీరాజ్ శాఖ డీఈ బాలనరసింహులు తెలిపారు.

మా గ్రామాన్ని అభివృద్ధి చేయండి



ఐదేళ్లుగా రెడ్డివారిపల్లె అభివృద్ధికి నోచుకోలేదు. ఎక్కడపడితే అక్కడ మురికి నీరు తాండవిస్తోంది. వీధుల్లోకి వెళ్లాలంటేనే ఇబ్బంది పడాల్సి వస్తోంది. అన్ని స్థానిక సంస్థలతో పాటు ఎన్నికలు నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- నాగులయ్య, రెడ్డివారిపల్లె

ఎన్నికలు లేకనే అభివృద్ధి ఆగింది



ఎన్నికలు జరగక పోవడంతోనే రెడ్డివారిపల్లె అభివృద్ధికి నోచుకోలేదు. రోడ్ల వర్షం లేకున్నా రోడ్ల పైన నీరు నిలుస్తోంది. వర్షం పడితే ఎలా ఉంటుందో అనుకుంటేనే భయం వేస్తోంది. ఇప్పటికైనా అభివృద్ధి చేయాలని వేడుకుంటున్నాము.

- సవరం శివమ్మ, రెడ్డివారిపల్లె, గ్రామస్తురాలు

తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

● పోలీసులకు టీడీపీ నాయకుల ఫిర్యాదు

రాయచోటిటౌన్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై ఫేస్‌బుక్‌లో అసత్య ఆరోపణలు చేస్తూ పోస్టులు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి ఆధ్వర్యంలో టీడీపీ నేతలు రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై ఆరోపణలు చేసిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

చిన్నమండెం: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తూ ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మండల టీడీపీ నాయకులు అక్రమ్, మాజీ ఎంపీటీసీ విజయభాస్కర్, కేశాపురం గ్రామ అధ్యక్షుడు విజయసారథిరెడ్డి, తెలుగు యువత నాగేంద్ర, భరత్, మయాన గౌస్‌ఖాన్, ఇమ్రాన్ అలీఖాన్, ఖదీర్, తాహీర్, చిన్నమండెం ఐటీడీపీ అధ్యక్షులు మహమ్మద్, రాజంపేట పార్లమెంట్ తెలుగు ప్రొఫెషనల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు.

రాయచోటి - నేతాజీ సర్కిల్: అక్రమ మద్యం కేసును మంత్రికి ఆపాదిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదని టీడీపీ నాయకుడు మడితాటి రవీంద్రారెడ్డి సూచించారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతూ దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.



రాయచోటి అర్బన్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదివారం విశ్రాంత ఉపాధ్యాయులు యర్రపురెడ్డి సుబ్బారెడ్డి, వరగంరెడ్డి సుబ్బారెడ్డి, సంబేపల్లె మండలం పొన్నెలవాండ్ల పల్లెకు చెందిన రెడ్డెప్పరెడ్డి, పీఎన్‌కాలనీ గ్రామం గొల్లపల్లికు చెందిన వరగంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని పూర్వ విద్యార్థులు డైట్ లెక్చరర్ రెడ్డెప్పరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. ఆదివారం సంబేపల్లెలోని తమ గురువులను ఇళ్ల వద్దకు వెళ్లి సన్మానించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ దగ్గర చదువుకొని ఉన్నత స్థానంలో ఉండడం, తమకెంతో గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరింత గొప్ప పదవులు చేపట్టాలని దీవించారు.



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులుతో సాయిలోకేశ్

రాజంపేట: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు ఈ కార్యక్రమంలో . లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తరిగొపుల లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ జనసేనపార్టీ పార్లమెంట్ కోఆర్డినేటర్ అతికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట : దళవాయిపల్లెలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రమణను ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి శాలువా కప్పి సత్కరించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్, బలిజసేన జిల్లా అధ్యక్షుడు నరసింహ, సీనియర్ న్యాయవాదులు లక్ష్మీనారాయణ, నాసర్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలతో ప్రభుత్వం కళ్లు తెరిపిద్దాం

● ఎస్టీయూ నేతల పిలుపు

రాయచోటిటౌన్, అక్టోంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్న కూటమి ప్రభుత్వానికి ధర్నాతో కళ్లు తెరిపిద్దామని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని డైట్ కేంద్రంలో జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు ఏ. శివారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి తీవ్ర అన్యాయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, కూటమి ప్రభుత్వం వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశలు అడియాసలయ్యాయన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నిజమని నమ్మి కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టామన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా కనీస స్పందన కరువైందన్నారు. 12వ పీఆర్సీ గడువు దాటి ఏళ్లు గడుస్తున్నా చర్యలు లేవన్నారు. పై సమస్యల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ విజయవాడలో జరగబోయే ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

ప్రసాద్‌బాబును కలిసిన కాపు ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ పరశురాం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బృందం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబును మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేశారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు

కలెక్టర్ దృష్టికి చేనేత కార్మికుల సమస్యలు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకుడు మోడం వీరాంజనేయప్రసాద్

రాయచోటిటౌన్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడు తొగటవీర క్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడం వీరాంజనేయప్రసాద్ శనివారం రాత్రి అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను కలిసి చేనేత కార్మికుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు మదనపల్లి, నీరుగట్టువారిపల్లె చుట్టుప్రక్కల ఉన్న చేనేత మగ్గాలను జియోట్యాగింగ్ చేయాలని కోరారు. మదనపల్లిలో సిల్క్‌హౌస్‌తో పాటు, చేనేత కార్మికులకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తొగటవీర క్షత్రియ సంఘం ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్ర వెంకట్రమణ, జాయింట్ సెక్రటరీ మోడం నాగభూషణం, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు భోజనపు వెంకట నారాయణ, ప్రధాన కార్యదర్శిగుండ్లపల్లి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన జనసేన నాయకులు

ఓబులవారిపల్లె, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిదిలోని చెన్నరాజుపోడు గ్రామ పంచాయతీకి చెందిన జోగినేని మణి, రైల్వే కోడూరు మండలానికి చెందిన మైసూరువారిపల్లె పగడాల చంద్రశేఖర్ జనసేనపార్టీలో రాయల సీమ జోన్ కన్వీనర్లుగా పనిచేస్తున్నారు. వారు ఆదివారం ఎస్పీ ధీరజ్ కనుబిల్లిని ఆయన కార్యా లయంలో కలిసి శాలువా కప్పి సన్మానం చేశా రు. ఈ సందర్భంగా శాంతిభద్రత చర్యలను పటిష్టంగా అమలుచేయాలని కోరినట్లు తెలిపారు.

పూలికుంటలో పొలిమేర దేవర



బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

గాలివీడు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలికుంట గ్రామంలోని పొలిమేర గంగమ్మకు ఆదివారం దేవర నిర్వహించారు. ఈ సందర్భంగా పూలికుంట, కొర్లకుంట గ్రామాల సరిహద్దులో దేవర చెలిమ వంకలో బోనాలు సమర్పించి జంతుబలులుఇచ్చి సహపంక్తి భోజనాలు చేశారు.

8 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లి లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 8 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మందికి పరీక్షలు నిర్వహించి 8 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 24 మందికి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దితే జాతిరత్నాలు అవుతారు

● పోతన సాహిత్యపీఠం అధ్యక్షుడు పసుపులేటి శంకర్

ఒంటిమిట్ట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను సరిగా తీర్చిదిద్దితే జాతి రత్నాలు కాగలరని ఒంటిమిట్ట పోతన సాహిత్యపీఠం అధ్యక్షులు పసుపులేటి శంకర్ అన్నారు. ఆదివారం కడపలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో గ్లోబల్ జ్ఞాన అకాడమీలో ఆరో అంతర్జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ బహుమతుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శిష్యుల ను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన గురువుకు గౌరవం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర ప్రసాద్, అకాడమీ ఎండీ రుక్సాన, ఏపీ తెలంగాణ అంబాసిడర్ మమతా నాయుడు, నాగరత్నమ్మ, ప్రియదర్శిని, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతి జాగృతి కోసం ఆర్‌ఎస్‌ఎస్ కృషి

రాజంపేట టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : జాతిని జాగృతం చేసి, దేశ ఐక్యత కోసం పని చేస్తున్న ఏకైక సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అని సేవాభారతి రాష్ట్ర సంఘటన కార్యదర్శి కేశవయ్య తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో స్వయం సేవకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఈ ఉత్సవాల సందర్భంగా రూ.100 నాణెం ఆవిష్కరించడం ఆనందిం చాల్సిన విషయ మన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ సంస్థ కాకున్నా, కొంతమంది బురదజల్లుతున్నారని విమర్శించారు. దేశం ఔన్నత్యం కోసం ఆర్‌ఎస్‌ఎస్ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఖండ కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యం, శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్, స్వయం సేవకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశవయ్య

ఒంటిమిట్ట : ఆర్‌ఎస్‌ఎస్ అంటే కేవలం ఒక సంస్థ కాదని, అది ఒక జీవన విధానమని, జిల్లా వీహెచ్‌పీ మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఒంటిమిట్టలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ గత వంద సంవత్సరాలుగా ఎటువంటి రాజకీయ ఆశలు లేకుండా దేశసేవలో నిలబడి ఉందన్నారు. సేవా కార్యక్రమాలు, విద్యారంగం, గ్రామీణ అభివృద్ధి, సహాయ కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేసుకుందన్నారు. రామకృష్ణ విద్యాలయ అధినేత వైసీ సుబ్బరాయుడు, మండల కార్య హక్కు వేణుగోపాల్‌రాజు, సంఘం ప్రబారి గంగాధర్ స్వయం సేవకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

8 నుంచి నీలకంఠ్రావుపేటలో క్రీడా పోటీలు

రామాపురం, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న బాలబాలికలకు అక్టోబరు 8, 9, 10వ తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. అండర్- 14, అండర్-17 విభాగాల్లో బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో-1 రామకృష్ణుడు, ఎంఈవో-2 జయచంద్ర, మండల కోఆర్డినేటర్ సతీశ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీలకంఠ్రావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ, ఏపీ మోడల్ స్కూల్, ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఈ పోటీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల కోఆర్డినేటర్ సతీశ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఆంజనేయులు, సురేంద్రరాజ్, విజయవాణి, ప్రతాప్, జావిద్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

కక్ష సాధించేందుకే దుష్ప్రచారం

● నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ

నందలూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) :తనపై దుష్ప్రచారం తగదని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులకు తమ పంచాయతీలో తీర్మానం ఇవ్వడం లేదని ఈ మధ్య జరిగిన మండల సమావేశంలో ఒక ఎంపీటీసీ సభ్యుడు ఆరోపించాడన్నారు. ఆ వ్యక్తి ఏ రోజైనా తీర్మానం విషయం తనతో మాట్లాడారా అని ప్రశ్నించారు. అదే వ్యక్తి గతంలో ఎటువంటి పంచాయతీ అనుమతులు లేకుండా పనులు చేయడంతోపాటు, బిల్లుల విషయంలో తనపై, సెక్రటరిపై అధికారులతో ఒత్తిడి తేలేదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం పంచాయతీ అనుమతులు లేకుండా పనులు చేస్తే బిల్లులు రావ న్నారు. తాను వైసీపీని వీడి టీడీపీలో చేరడంతో తనపై కక్ష సాధించేందుకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వ్యక్తిగత విమర్శలు వీడి పంచాయతి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

విద్యార్థి వైద్యం కోసం ఆర్థిక సాయం

సుండుపల్లె, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ జనసేన పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థి నాగ చైతన్య వైద్యం కోసం ఆదివారం రూ.71,250 ఆర్థిక సాయం చేసినట్లు జనసేన నాయకులు తెలిపారు. జున్నుపల్లి మండలం నిన్నమీద బలిజపల్లెకు చెందిన నాగరాజు కుమారుడు నాగచైతన్య అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకొని ఆర్థిక సాయం అందజేయడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకు నేందుకు ముందుకు వచ్చిన గల్ఫ్ జనసేన సభ్యులకు జనసేన సీనియర్ నాయకుడు రామాశ్రీనివాస్,ఒంటేరురాజా, జగిలి ఓబులేసు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేన నాయకులు

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభలకు తరలిరండి

రాయచోటిటౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న రాయచోటిలో జరగనున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయాస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు అబ్బవరం రామాంజులు, జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, ఉపాధ్యక్షుడు చెన్నయ్య, రామకృష్ణ, కార్యదర్శి శివకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బీవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. మదనపల్లి, రాయ చోటి, రాజంపేట, బీ. కొత్తకోట మున్సిపాలిటీల నేతలు శ్రీరాములు, శ్రీనాథ్, వెంకటేశ్, గంగయ్య, రెడ్డెయ్య, ఏడుకొండలు, గోపాల్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

రైల్వేకోడూరు, అక్టోబరు 5(ఆంధ్రవజ్యోతి): పట్టణంలోని ఇమామ్‌సాహెబ్ వీధికి చెందిన పేదలకు నెట్టూరు నాగేశ్వ, ప్రీతి కుమార్తె జాశ్విత పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం భోళాశంకర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యావసరాలను పంపిణీ చేశారు. చెన్నంశెట్టి రమేష్‌బాబు, ఉత్తరాది శివ కుమార్, మహంకాళి సుబ్రహ్మణ్యం, పెనుగొండ సుబ్బరాయుడు, పూలశెట్టి రాజేశ్వరి, నాగరాజ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువ మరమ్మతు పనులు ప్రారంభం

పుల్లంపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కోనమ్మ చెరువు పంట కాలువ మరమ్మతు పనులను ఆదివారం టీడీపీ యువనేత ముక్కా సాయివికాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కాలువ 40 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో చెరువుకు నీరు రావడం లేదని స్థానికులు ముక్కా రూపానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

నీట మునిగిన వీధులు

నందలూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : బాహుదా నది నుంచి కన్యక చెరువుకు నీరు తరలించే క్రమంలో కాలువ లీకేజీల కారణంగా నాగిరెడిపల్లె గ్రామ పంచాయతీ లోని అరవపల్లె ఆర్‌అండ్ బీ బంగ్లా వెనుక వైపు ఉన్న పలు వీధులు ఆదివారం ముంపునకు గురయ్యాయి.. పది రోజులుగా ఈ కాలువ ద్వారా నీరు తరలిస్తున్నారు. ఆదివారం రోజూ కంటే ఎక్కువ పరిమాణంలో నీరు వదలడంతో ఈ సమస్య ఏర్పడింది. నీటితో పాటు పలురకాల విష సర్పాలు వీధుల్లోకి రావడంతో ప్రజలు భయ బ్రాంతులకు గురవుతున్నారు. ఆర్‌యూబీ మునిగిపోవడంతో నాగిరెడ్డిపల్లె, అరవపల్లె గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ప్రజలకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



ఇళ్ల మధ్యకు చేరిన నీరు

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి జ్యోతుల ఉత్సవం

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్యాల గ్రామం పెద్దకోడివాండ్లపల్లెలో శనివారం రాత్రి తొగట వీర క్షత్రియులు చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అశ్వ వాహనం పై అమ్మవారిని ఊరేగించారు. కొంత మంది అమ్మవారికి బోనాలు సమర్పించారు.



తొగటపల్లిలో చౌడేశ్వరి ఆలయంలో మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్: మండల పరిధిలోని శిబ్యాల గ్రామం తొగటపల్లెలో ఆదివారం చౌడేశ్వరి ఆలయ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు, టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు

లక్కిరెడ్డిపల్లె: అనంతపురం గ్రామంలో ఆదివారం గంగమ్మకు రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు యనమల మదన్‌మోహన్‌రెడ్డి పూజలు చేశారు. ఆలయ ఈవో శ్రీనివాసులు, మదన్‌మోహన్ వారిని సత్కరించారు.

గుంజనేరుకు వరద

రైల్వేకోడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా గుంజన నదిలో నీరు ప్రవహిస్తోంది. వాగేటికోన, గుంజన జలపాతం నుంచి వరద నీరు వచ్చిందని స్థానికులు తెలిపారు. రైల్వేకోడూరు ప్రాంతంలో వర్షాలు ఆలస్యంగా కురవడంతో ఇటీవల నదులు ఎండిపోయాయి. ప్రస్తుతం వర్షం రాకతో జలకళ ఏర్పడింది.



గుంజనేరులో ప్రవహిస్తున్న నీరు

రాయచోటి వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం



దిక్కూమొక్కు లేని మార్కెట్ యార్డు

- ప్రహరీ గోడ, ఆర్చి, గేటు లేని వైనం
- నిరుపయోగంగా శీతల గిడ్డంగులు
- ఇదీ రాయచోటి వ్యవసాయ మార్కెట్ యార్డు దుస్థితి

రాయచోటిటౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని మాసాపేటలో కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారికి పక్కన మాండవ్యనది ఒడ్డున సుమారు 22 ఎకరాల విస్తీర్ణంలో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది పాలకుల నిర్లక్ష్యానికి గురై దిక్కూమొక్కు లేకుండా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాయచోటి, సుండుపల్లె, సంబేపల్లె, చిన్నమండెం మండలాల రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను భద్రపర్చుకోవడంతో పాటు విక్రయించేందుకు ఈ మార్కెట్ యార్డును ఏర్పాటు చేశారు. అయితే మార్కెట్‌యార్డు అయినప్పటి నుండి కేవలం పశువుల సంతగా, పౌరసరఫరాల శాఖ నిత్యావసర సరుకుల గోడౌన్‌గా, భూసార పరీక్షల కేంద్రం అవసరాలకు మాత్రమే ఉపయోగపడేది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మార్కెట్‌యార్డు ప్రహరీ గోడతో పాటు కొంత స్థలానికి నష్టపరిహారం కింద రూ.70 లక్షలు అందించింది. కానీ అప్పటి పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా ఇప్పటికీ తిరిగి ప్రహరీగోడను నిర్మించకపోవడంతో ప్రస్తుతం ఇది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా మార్కెట్ యార్డుకు మోక్షం కలుగుతుందని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

యార్డుకు చేరని మామిడి, టమోటా ఉత్పత్తులు

సుమారు 22 ఎకరాల విస్తీర్ణంతో పాటు పంట ఉత్పత్తులను నిల్వ ఉంచేందుకు అవసరమైన గిడ్డంగులు, ప్లాట్‌ఫామ్స్ ఉన్నప్పటికీ మార్కెట్ యార్డు నిర్మించినప్పటి నుండి ఇప్పటి వరకు మామిడి, టమోటా ఉత్పత్తులు మార్కెట్ యార్డుకు వచ్చిన దాఖలాలు లేవు. ప్రధానంగా సుండుపల్లె, సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి మండలాల్లో అత్యధికంగా మామిడితో పాటు టమోటా పంట కూడా సాగులో ఉంది. అయితే రైతులు ఈ పంటలను రాయచోటి పట్టణంలోని ఠాణా సమీపంలో ఉన్న మామిడి మండీలకు, కలకడ, గుర్రంకొండ తదితర ప్రాంతాల్లో ఉన్న టమోటా యార్డులకు తరలించి అక్కడి దళారుల చేతిలో మోసపోతూ నష్టాలపాలవుతున్నారు. అలాగే భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి ఎదురుగా అత్యంత ఇరుకుగా ఉన్న కూరగాయల మార్కెట్‌కు టమోటా, ఇతర కూరగాయలను తీసుకెళ్లి దళారులు నిర్ణయించిన రేట్లకే విక్రయిస్తూ మోసపోతున్నారు. కాగా కొత్తపేట సమీపంలో బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పక్కనే సిరికల్చర్ కార్యాలయం ఆవరణంలో రూ.కోటి వెచ్చించి ఆధునాతన హంగులతో రైతు బజారును నిర్మించినప్పటికీ వ్యాపారులు, కొనుగోలుదారులు సక్రమంగా రాకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ప్రజలు కూడా అధునాతన సౌకర్యాలతో నిర్మించిన రైతుబజారులో కూరగాయలు కొనుగోలు చేయకుండా పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ రోడ్లపైన, మురుగునీటి కాలువలపైన కూరగాయలను విక్రయిస్తున్నా ముక్కు మూసుకొని కొనుగోలు చేస్తుండడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



ఆర్చి, ప్రహరీ గోడ, గేటు లేని రాయచోటి మార్కెట్ యార్డు

ప్రజలకు ఎంతో ఉపయోగకరం

ప్రస్తుతం ఠాణా వద్ద మామిడి మండీలు ఉండడం వలన మామిడికాయల సీజన్‌లో ఇతర రాష్ట్రాల నుండి వచ్చే పెద్దపెద్ద లారీలు, ఇతర వాహనాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే ట్రాఫిక్ సమస్యతో అల్లాడుతున్నారు. ఈ మామిడి మండీలను మాసాపేట వద్ద ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించడంతో పాటు భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి ముందు భాగంలో భక్తులకు అసౌకర్యంగా ఉన్న కూరగాయల మార్కెట్‌ను కూడా మార్కెట్ యార్డులోకి తరలిస్తే పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు ఇతర ఇబ్బందులు తొలగుతాయని పలువురు కోరుతున్నారు. ఈ మేరకు పాలకులతో పాటు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. దీనికి తోడు లక్షలాది రూపాయలు వెచ్చించి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించిన శీతల గిడ్డంగులు ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా నూతన పాలకవర్గంతో పాటు మార్కెట్ యార్డు అధికారులు యార్డు దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రహరీగోడను నిర్మిస్తాం..



రాయచోటి మార్కెట్ యార్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా తొలగింపునకు గురైన ప్రహరీగోడ స్థానంలో ప్రభుత్వ అనుమతితో త్వరలోనే నిర్మిస్తాం. అలాగే ముందు భాగంలో ఆర్చి, గేటు కూడా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం. అలాగే మామిడి, టమోటా పంటను విక్రయించేందుకు అవసరమైన గదులను కూడా నిర్మించి రైతులకు, వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. రాయచోటి మార్కెట్ యార్డును అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

- అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్



కంపచెట్లు, పిచ్చిమొక్కలతో ఉన్న మార్కెట్ యార్డు ప్రాంగణం



నిరుపయోగంగా ఉన్న శీతల గిడ్డంగి

వెల్లాల దేవస్థానానికి విరాళాల వెల్లువ



రూ.లక్షా116 విరాళం అందిస్తున్న సంజీవరాయుడు

రాజుపాలెం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెన్నకేశవ సంజీవరాయస్వామి దేవస్థానం పునరుద్ధరణకు విరాళాల వెల్లువ మొదలైంది. ఆదివారం భీమునిపాడు గ్రామం కోవెలకుంట్ల మండలానికి చెందిన చలివేంద్ర సంజీవరాయుడు రూ.1,00,116 విరాళంగా అందించారు. అలాగే ఆళ్లగడ్డ గ్రామానికి చెందిన అమరావతి లక్ష్మీదేవి రూ.20వేలు అందించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి వారిని అభినందించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ గంగిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, ఆలయ కమిటీ మెంబర్లు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, స్కూటర్ ఢీ : విద్యార్థి మృతి



మహేష్ (ఫైల్)

చక్రాయపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంజనేయపురం సమీపాన పాత తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా శనివారం రాత్రి ట్రాక్టర్‌ను స్కూటర్ ఢీకొట్టడంతో మహేష్ (16) అనే విద్యార్థి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దసరా సెలవులు కావడంతో మహేష్ అనంతపురం జిల్లా మడకశివరలో ఇంటర్ సెకండియర్ చదువుతూ ఇంటివచ్చాడు. తండ్రి గొర్రెల కాపరి. ఆంజనేయపురంలో గొర్రెలను తోలుకొని ఉండగా తండ్రికి అన్నం ఇవ్వడానికి మహేష్ గొల్లపల్లె నుంచి ఆంజనేయపురం వెళ్లాడు. తండ్రికి అన్నం ఇచ్చి తిరిగి వస్తుండగా ట్రాక్టరు ఢీకొనడంతో తీవ్రగాయాలు తగలడంతో వేంపల్లెకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు సమాచారం. పోలీసులు విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

డబ్బు విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ

- ఇరువురికి గాయాలు

పులివెందుల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పులివెందులకు చెందిన సాతుపాటి శ్రీను, రాజేష్, అలాగే రామేశ్వర్‌రెడ్డి, వెంకటపతిలకు చెందిన ఇరువర్గాల మధ్య డబ్బు విషయమై ఆదివారం ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాల్లోకెళితే... సాతుపాటి శ్రీను, రాజేష్, పులివెందులకు చెందిన రామేశ్వర్‌రెడ్డి ముదిగుబ్బలో నివాసముంటున్నారు. సాతుపాటి శ్రీను, రాజేష్‌లు బలవంతంగా రూ.9లక్షలు బాకీ ఉన్నట్లు రామేశ్వర్‌రెడ్డితో ప్రామిసరీ నోటు (బాండ్) రాయించుకున్నారు. ఈ విషయమై సాతుపాటి శ్రీను, రాజేష్‌లకు ప్రత్యర్థి అయిన వెంకటపతికి తనతో బలవంతంగా బాండు రాయించుకున్న విషయాన్ని రామేశ్వర్‌రెడ్డి వివరించారు. దీంతో వెంకటపతి అతని అనుచరులు న్యాక్‌బిల్డింగ్ సమీపంలో సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గొడవకు దిగేందుకు ప్రయత్నించారు. గొడవ ప్రారంభమయ్యే సమయానికి అర్బన్ సీఐ సీతారామిరెడ్డి, సిబ్బంది ఆ పరిసర ప్రాంతాల్లో ఉండడంతో వెంటనే అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం సాతుపాటి శ్రీను,రాజేష్‌లు ఇంటిపై నుంచి బీరుబాటిళ్లు విసిరేశారు. అప్పటికే ఇరువర్గాలకు చెందిన పలువురు అక్కడకు చేరుకోవడంతో ఘర్షణకు దిగి రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఇరువురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న డీఎస్పీ మురళీనాయక్, సీఐలు సీతారామిరెడ్డి, రమణ తమ సిబ్బందితో వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గాయపడిన ఇరువురిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

- నలుగురిపై కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని శంకరాపురానికి చెందిన అంజన గిరిబాబుపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. అంజని గిరిబాబు ఆర్టీసీ బస్టాండు సమీపంలో నడుచుకుంటూ వెళుతుండగా మృత్యుంజయకుంటకు చెందిన మధు తన స్నేహితులతో కలిసి ఎదురుగా వెళ్లి గిరిని ఢీకొట్టాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో మధు అతని స్నేహితులు కలిసి గిరి తలపై బాదారు. దీంతో గిరి తలకు గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి..?

చక్రాయపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డంవారిపల్లె సమీపాన నక్కలదిన్నెపల్లెకు చెందిన ప్రతాపరెడ్డి (55) తేనెటీగల దాడిలో మృతి చెందాడని ఆయన కుమారుడు నవీన్‌కుమార్‌రెడ్డి పోలీసులు ఫిర్యాదు చేశారు. ఆ వివరాల్లోకి వెళితే... ప్రతాపరెడ్డి, మరికొందరు శనివారం గడ్డంవారిపల్లె సమీపంలోని తెల్లగొండ నారవలో కొయ్యలకు వెళ్లారు. కొయ్యలు కొట్టుకుంటుండగా తేనెటీగలు దాడి చేయడంతో ప్రతాపరెడ్డి మృతి చెందినట్లు కథ అల్లారు. చివరికి గ్రామంలో పుకార్లు చెలరేగాయి. తేనెటీగలు కాదు గుప్తనిధుల కోసం వెళ్లి ఏం జరిగిందో ఏమో ప్రతాపరెడ్డి మృతి చెందాడు. పోలీసులు మాత్రం ఎక్కడ గాయాలు లేవని తెలిపారు. ప్రతాప్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పోస్టుమార్టం రాగానే కేసునమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ప్రతాపరెడ్డి మృతిపై పలు అనుమానాలు వస్తున్నట్లు సమాచారం.

వృద్ధురాలిపై దాడి

- బంగారు గొలుసు అపహరణ



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న లక్ష్మీనరసమ్మ

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిట్వేలి రోడ్డులో నివసిస్తున్న లక్ష్మీనరసమ్మ అనే వృద్ధురాలు ఆదివారం సాయంత్రం బయనపల్లి రహదారిలోని ఒక ప్రైవేట్ పాఠశాల సమీపంలో ఉన్న చెరువు కట్టపై వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి మోటార్ బైకుపై వచ్చి ఆమెపై దాడి చేసి, మెడలో ఉన్న 33 గ్రాముల బంగారు గొలుసును దొంగిలించి పారిపోయాడు. రోడ్డుపై పడిపోయిన ఆమెను గుర్తించిన స్థానికులు వారి బంధువులకు సమాచారం అందించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి వెంటనే సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు, కొత్త వ్యక్తులపై సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రైతుల అభివృద్ధికి కృషి చేయాలి

- పులివెందుల మార్కెట్ యార్డు పాలక మండలి ప్రమాణస్వీకారంలో బీటెక్ రవి



మార్కెట్ యార్డు చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న గడ్డం అమర్‌నాథ్‌యాదవ్

పులివెందుల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ పాలక మండలి రైతుల అభివృద్ధి కోసం కృషి చేయాలని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. ఆదివారం సాయంతరం పులివెందుల మార్కెట్ యార్డులో నూతన పాలక మండలి ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పులివెందుల మార్కెట్ యార్డుచైర్మన్‌గా గడ్డం అమర్‌నాథ్‌యాదవ్, కార్యదర్శిగా శ్రీధర్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ ఇప్పటి వరకు పులివెందుల మార్కెట్ యార్డులో చీనీ వ్యాపారం మాత్రమే సాగేదని, అది కూడా కేవలం వంద టన్నుల చీనీకాయలు మాత్రమే వచ్చేవన్నారు. కానీ కలెక్టర్ చొరవతో ప్రస్తుతం 400 నుంచి 500టన్నుల చీనీకాయలు మార్కెట్ యార్డుకు వస్తున్నాయన్నారు. గతంలో ఏడెనిమిది మంది మాత్రమే వ్యాపారులు వేలం వేసేవారని, అది కూడా రూ.15వేలు పలికే చీనీకాయలు రూ.13వేలకే సిండికేట్ అయి పాడుకుంటున్నారనే అపవాదు ఉండేదన్నారు. ప్రస్తుతం ఆ అపవాదు నుంచి బయటపడి అనంతపురం మార్కెట్ కంటే రూ.1000 ఎక్కువగా పాడుతున్నారన్నారు. ఇంకా ఎవరైనా వ్యాపారులు వస్తే ఇక్కడ అవకాశం కల్పిస్తామన్నారు. పులివెందుల మార్కెట్‌యార్డులో రెండు మూడు రోజుల్లో టమోటా వ్యాపారాన్ని కూడా ప్రారంభించబోతున్నామన్నారు. సోమవారం నుంచి ఈనామ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేయబోతున్నామన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాష, పులివెందుల పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, టీడీపీనాయకులు శివమోహన్‌రెడ్డి, పార్థసారధిరెడ్డి, వేంపల్లె పరిశీలకులు రఘునాథరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరెడ్డి, షబ్బీర్, విశ్వనాథరెడ్డి, బీజేపీ నాయకులు సుష్మ, వాజ్‌పేయి నాయుడు, నవీన్, జనసేన నాయకులు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కనుమ పోలేరమ్మ రథోత్సవం

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆధ్వర్యంలో కనుమ పోలేరమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తిశ్రద్ధలతో రథోత్సవాన్ని ఆలయ గుడి చుట్టూ ఊరేగించారు. ఇందులో దాతలు పెద్దముడియం గ్రామానికి చెందిన సాంబవరం జగదీశ్వర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఈ రథాన్ని వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు ప్రసాద్, మిధున్, నాగలింగాచారి, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, చిన్న తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కారు, లారీ ఢీ : ఒకరికి గాయాలు

పోరుమామిళ్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగపల్లె సమీపంలో ఆదివారం కారును లారీ ఢీకొన్న సంఘటనలో సుబ్బలక్ష్మి అనే మహిళకు గాయాలయ్యాయి. ప్రొద్దుటూరుకు చెందిన సుబ్బలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులు పోరుమామిళ్లకు కారులో వెళుతుండగా నర్సింగపల్లె సమీపంలోకి రాగానే లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె కాలికి తీవ్ర గాయం కావడంతో పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరుకు తరలించారు.

మంగంపేట వద్ద రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి.. ఇరువురికి గాయాలు

ఒంటిమిట్ట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగంపేట ఆంజనేయస్వామి గుడి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వివాహిత మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మలకాటిపల్లె గ్రామానికి చెందిన శివారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సాయంత్రం నందలూరు మండలం నల్లతిమ్మాయపల్లెకు తన వాహనంలో బయలుదేరారు. సరిగ్గా మంగంపేట ఆంజనేయస్వామి గుడి సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో శివారెడ్డి భార్య రేణుక(40) సంఘటన స్థలంలోనే మృతి చెందారు. శివారెడ్డి, మరో మహిళ వెంకటలక్షుమ్మకు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ముద్దనూరు, అక్టోబర్ 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనాపురం సమీపంలోని కొండప్రాంతంలో ఉన్న కంపచెట్లలో ఆదివారం పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.10,250 నగదు, పేకలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఉపేక్షించదు

తంబళ్లపల్లె, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం తయారీ కేసులో తప్పు ఎవరిదున్నా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, కఠిన చర్యలు తీసుకుంటుందని టీడీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి నాంది రెడ్డప్ప పేర్కొన్నారు. ఆదివారం ఆయన ములకలచెరువులో కల్తీ మద్యం తయారీని తీవ్రంగా ఖండించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కల్తీ మద్యం తయారు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఒక ప్రకటనలో కోరారు.

భాషా పండితులకు పదోన్నతులు హర్షణీయం



ఎస్ఎల్‌టీఏ నేతలను సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పదోన్నతుల కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న భాషా పండితులకు విజయదశమి రోజు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ప్రకటన చేయడం హర్షణీయమని భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఆదివారం ఎస్వీ డిగ్రీ కళాశాలలో భాషోపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్లకు పదోన్నతులు కల్పించడానికి కృషి చేసిన ఎస్ఎల్‌టీఏ నాయకులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, అంకాల్ కొండయ్య, ప్రసాద్, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 18 వేల మంది పండిట్లు, వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన ఘనత రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థకు దక్కుతుందన్నారు. పండి ట్లకు పదోన్నతులు రావడానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కృషి చేశారన్నారు. ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్‌కొండయ్య మాట్లాడుతూ హైకోర్టు తీర్పు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏ పాఠశాలలో పనిచేస్తున్న భాషా పండిట్లకు అదే పాఠశాలలో పదోన్నతులు కల్పించిందన్నారు. కార్యక్రమంలో భాషోపాధ్యాయులు లక్ష్మీనరసయ్య, సుజాత, రామకృష్ణ, రోషన్, లక్ష్మీరాయల్, రామిరెడ్డి, రామసుబ్బారెడ్డి, మణికంఠ, భాస్కర్ పాల్గొన్నారు.

రేపటి పౌరులను తీర్చిదిద్దే శిల్పులు.. ఉపాధ్యాయులు

- ఎమ్మెల్సీలు రామగోపాల్‌రెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి
- ఘనంగా అపుస్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు రేపటి పౌరులను తీర్చిదద్దే మహాశిల్పులని ఎమ్మెల్సీలు రామగోపాల్‌రెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అపుస్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఉపాధ్యాయులు సమాజానికి చేస్తున్న నిరుపమాన సేవలను ప్రశంసించారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఉపాధ్యాయుడి పాత్ర అత్యంత కీలకమైనదని, అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు నడిపించే ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎల్లప్పుడు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబరు 5న ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలగంగయ్య, శివశంకర్‌రెడ్డి, ప్రతినిధులు మేడా నరసింహులు, పోలి వెంకటసుబ్బయ్య, మైథిలి తదితరులు పాల్గొన్నారు.




ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, అపుస్మా ప్రతినిధులు.. కార్యక్రమానికి హాజరైనవారు

సంక్షేమ పథకాల పరుగు



పాలాభిషేకం చేస్తున్న నేతలు, ఆటోడ్రైవర్లు

కలకడ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి అగ్ర నేతల సారధ్యంలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పరుగులు పెడుతున్నాయని టీడీపీ మైనార్టీ నేతలు అన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్ల ఖాతాల్లో రూ. 15 వేలు జమ చేసినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నేతలు మునాఫ్, యల్లమంద జిలానీ, ముబారక్‌అలీ, నౌషాద్, ఇర్ఫాన్, ఖాజా, జపార్‌హుస్సేన్ ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

చిప్పిలిలో దుర్గమ్మ నిమజ్జనం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): దుర్గమ్మ ఊరేగింపులు, నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. చిప్పిలిలో దుర్గాదేవి ఉత్సవాలు ఆదివారం కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. దుర్గామాతకు ప్రత్యేకంగా అలంకరణలు చేసి బళ్లారి డ్రమ్స్, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుతో నిమజ్జనానికి తరలించారు. శశికుమార్, వార్డు సభ్యులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

యూరియా కోసం పోటెత్తిన రైతులు



యూరియా బస్తాలు తీసుకెళతున్న దృశ్యం

నిమ్మనపల్లి అక్టోబ రు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణం స్థానిక క్రిష్ణా ట్రేడర్స్‌లో ఆదివారం యూరియా కొనుగోలు చేసేందుకు రైతులు పోటెత్తారు. కాగా ప్రసుత్తం యూరియాకు డిమాండ్ వున్నందున ఉదయం 7గంటల నుంచి రైతులు కొనుగోలు చేశారు. అయితే ఒక ఆధార్ కార్డుకు నాలుగు బస్తాల చొప్పున ఇవ్వడంతో అవసరం లేకున్నా కొందరు రైతులు నాలుగు బస్తాలను కొనుగోలు చేశారు దీంతో తరువాత వచ్చిన రైతులకు మూరియా లేకుండా పోయింది. ఆర్బీకేలకు యూరియా సరఫరా చేస్తున్నా రైతులు మాత్రం యూరియా కోనేందుకు ఎగబడ్డారు. రైతులు మాట్లాడుతూ కొందరు రైతులు అవసరం లేకున్నా యూరియా కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటుండడంతో పంటలు వేసిన రైతులకు యూరియా దొరకడం లేదని తెలిపారు. పైగా యూరియా బస్తా రేటు కలిపి రూ.300 దాకా వుండగా ఎరువుల దుకాణం క్రిష్ణాట్రేడర్స్‌లో మాత్రం రూ.350కి పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులు అధిక రేట్లపై దీనిపై దృషి సారించాల్సివుంది.

మదనపల్లెను జిల్లా చేయాలని తీర్మానం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డిసాహెబ్

మదనపల్లె అర్బన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ఏర్పాటులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తోందని కాంగ్రెస్ నేత రెడ్డి సాహెబ్ అన్నారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సాధన జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా సాధన కోసం మలిదశ పోరాటాలు ప్రారంభమయ్యాయన్నారు. 26న పెద్ద ఎత్తున నిరసన చేపడుతున్నట్లు ప్రకటించారు. మదనపల్లె జిల్లాగా ఎప్పుడు ప్రకటన వస్తోందని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో 632 రోజులు అనేక పోరాటాలు చేసిందన్నారు. నేటికి కూటమి ప్రభుత్వం జిల్లా ఏర్పాటు కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని దుయ్యబట్టారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం, బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్య క్షుడు బోడెం రాజశేఖర్, సీపీఎం ప్రభాకర్‌రెడ్డి, సీపీఐ మురళి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేబాష కాంగ్రెస్ పార్టీ నేతలు మీనాకుమారి, ముబారక్, శరత్‌కుమార్ రెడ్డి, రవీంద్ర, పాలేటి, మహబూబ్‌బాషా, భానుప్రకాష్‌రెడ్డి, మాలమహానాడు, వీసీకే నేతలు గుండాల మనోహర్, మల్లెల మోహన్, రామమాంజలు, పీరుసాహెబ్ పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

గుర్రంకొండ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జూదరులపై పోలీసులు దాడులు చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. సంగసముద్రం పొలాల్లో జూదం అడుతున్నట్లు అందిన సమాచారంతో ఎస్ఐ సిబ్బందితో దాడులు చేసి ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారి నుంచి రూ. 1580 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మేధో సంపన్నుడు భక్తకనకదాసు



మంత్రి సవితమ్మతో లక్ష్మీప్రసన్న కమల్‌నాథ్

కలకడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తన కీర్తనలతో ప్రపంచాన్ని మెప్పించిన తత్వవేత్త, సంగీత కారుడు భక్తకనక దాసు మేధో సంపన్నుడని పీలేరు నియోజకవర్గ టీడీపీ సర్పంచుల సంఘం అధ్యక్షులు లక్ష్మీప్రసన్న కమల్‌నాథ్ అన్నారు. ఆదివారం తిరుపతిలో నిర్వహించిన భక్తకనకదాసు విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. హాజరైన బీసీ వేల్ఫేర్, జౌళి మంత్రి సవితమ్మ, హిందూపురం ఎంపీ పార్థసారధిని కలిసినట్లు తెలిపారు.

ముదివేడు స్టేషన్ ఎస్పీ తనిఖీ



వివరాలు సేకరిస్తున్న ఎస్పీ

కురబలకోట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ముదివేడు పోలీస్టేషన్‌ను ఆదివారం ఎస్పీ ధీరజ్‌కునుబిల్లి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, హాజరైన వ్యక్తుల వివరాలను సేకరించారు. శాంతి భద్రతలకు గట్టిగా పనిచేయాలని, ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ దిలీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రాయచోటి వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం



దిక్కూమొక్కు లేని మార్కెట్ యార్డు

- ప్రహరీ గోడ, ఆర్చి, గేటు లేని వైనం
- నిరుపయోగంగా శీతల గిడ్డంగులు
- ఇదీ రాయచోటి వ్యవసాయ మార్కెట్ యార్డు దుస్థితి

రాయచోటిటౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని మాసాపేటలో కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారికి పక్కన మాండవ్యనది ఒడ్డున సుమారు 22 ఎకరాల విస్తీర్ణంలో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది పాలకుల నిర్లక్ష్యానికి గురై దిక్కూమొక్కు లేకుండా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాయచోటి, సుండుపల్లె, సంబేపల్లె, చిన్నమండెం మండలాల రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను భద్రపర్చుకోవడంతో పాటు విక్రయించేందుకు ఈ మార్కెట్ యార్డును ఏర్పాటు చేశారు. అయితే మార్కెట్‌యార్డు అయినప్పటి నుండి కేవలం పశువుల సంతగా, పౌరసరఫరాల శాఖ నిత్యావసర సరుకుల గోడౌన్‌గా, భూసార పరీక్షల కేంద్రం అవసరాలకు మాత్రమే ఉపయోగపడేది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మార్కెట్‌యార్డు ప్రహరీ గోడతో పాటు కొంత స్థలానికి నష్టపరిహారం కింద రూ.70 లక్షలు అందించింది. కానీ అప్పటి పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా ఇప్పటికీ తిరిగి ప్రహరీగోడను నిర్మించకపోవడంతో ప్రస్తుతం ఇది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా మార్కెట్ యార్డుకు మోక్షం కలుగుతుందని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

యార్డుకు చేరని మామిడి, టమోటా ఉత్పత్తులు

సుమారు 22 ఎకరాల విస్తీర్ణంతో పాటు పంట ఉత్పత్తులను నిల్వ ఉంచేందుకు అవసరమైన గిడ్డంగులు, ప్లాట్‌ఫామ్స్ ఉన్నప్పటికీ మార్కెట్ యార్డు నిర్మించినప్పటి నుండి ఇప్పటి వరకు మామిడి, టమోటా ఉత్పత్తులు మార్కెట్ యార్డుకు వచ్చిన దాఖలాలు లేవు. ప్రధానంగా సుండుపల్లె, సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి మండలాల్లో అత్యధికంగా మామిడితో పాటు టమోటా పంట కూడా సాగులో ఉంది. అయితే రైతులు ఈ పంటలను రాయచోటి పట్టణంలోని రాణా సమీపంలో ఉన్న మామిడి మండీలకు, కలకడ, గుర్రంకొండ తదితర ప్రాంతాల్లో ఉన్న టమోటా యార్డులకు తరలించి అక్కడి దళారుల చేతిలో మోసపోతూ నష్టాలపాలవుతున్నారు. అలాగే భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి ఎదురుగా అత్యంత ఇరుకుగా ఉన్న కూరగాయల మార్కెట్‌కు టమోటా, ఇతర కూరగాయలను తీసుకెళ్లి దళారులు నిర్ణయించిన రేట్లకే విక్రయిస్తూ మోసపోతున్నారు. కాగా కొత్తపేట సమీపంలో బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పక్కనే సిరికల్చర్ కార్యాలయం ఆవరణంలో రూ.కోటి వెచ్చించి ఆధునాతన హంగులతో రైతు బజారును నిర్మించినప్పటికీ వ్యాపారులు, కొనుగోలుదారులు సక్రమంగా రాకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ప్రజలు కూడా అధునాతన సౌకర్యాలతో నిర్మించిన రైతుబజారులో కూరగాయలు కొనుగోలు చేయకుండా పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ రోడ్లపైన, మురుగునీటి కాలువలపైన కూరగాయలను విక్రయిస్తున్నా ముక్కు మూసుకొని కొనుగోలు చేస్తుండడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



ఆర్చి, ప్రహరీ గోడ, గేటు లేని రాయచోటి మార్కెట్ యార్డు



కంపచెట్లు, పిచ్చిమొక్కలతో ఉన్న మార్కెట్ యార్డు ప్రాంగణం



నిరుపయోగంగా ఉన్న శీతల గిడ్డంగి

ప్రజలకు ఎంతో ఉపయోగకరం

ప్రస్తుతం రాణా వద్ద మామిడి మండీలు ఉండడం వలన మామిడికాయల సీజన్‌లో ఇతర రాష్ట్రాల నుండి వచ్చే పెద్దపెద్ద లారీలు, ఇతర వాహనాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే ట్రాఫిక్ సమస్యతో అల్లాడుతున్నారు. ఈ మామిడి మండీలను మాసాపేట వద్ద ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించడంతో పాటు భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి ముందు భాగంలో భక్తులకు అసౌకర్యంగా ఉన్న కూరగాయల మార్కెట్‌ను కూడా మార్కెట్ యార్డులోకి తరలిస్తే పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు ఇతర ఇబ్బందులు తొలగుతాయని పలువురు కోరుతున్నారు. ఈ మేరకు పాలకులతో పాటు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. దీనికి తోడు లక్షలాది రూపాయలు వెచ్చించి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించిన శీతల గిడ్డంగులు ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా నూతన పాలకవర్గంతో పాటు మార్కెట్ యార్డు అధికారులు యార్డు దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రహరీగోడను నిర్మిస్తాం..



రాయచోటి మార్కెట్ యార్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా తొలగింపునకు గురైన ప్రహరీగోడ స్థానంలో ప్రభుత్వ అనుమతితో త్వరలోనే నిర్మిస్తాం. అలాగే ముందు భాగంలో ఆర్చి, గేటు కూడా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం. అలాగే మామిడి, టమోటా పంటను విక్రయించేందుకు అవసరమైన గదులను కూడా నిర్మించి రైతులకు, వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. రాయచోటి మార్కెట్ యార్డును అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

- అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్

ఇరువర్గాల మధ్య ఘర్షణ : ముగ్గురికి గాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. బాధితుడి వివరాల మేరకు.. తట్టివారిపల్లె కాలనీకి చెందిన షేక్ దాదావల్లి 15 ఏళ్ల కిందట కలకడ మండలం కోన గ్రామం నుంచి మదనపల్లెకు వచ్చి పండ్ల వ్యాపారం చేస్తూ స్థిరపడ్డాడు. తన మరదలికి విడాకులకు సపోర్టు చేస్తున్నాడనే నెపంతో తన మరదలి భర్త లారీ డ్రైవర్ షేక్‌షావల్లి శనివారం రాత్రి పదిమంది రౌడీ మూకలతో వచ్చి ఇంట్లోకి చొరబడి షేక్ దాదావల్లి, భార్య, కుమారుడిపై రాడ్లతో దాడి చేశారని, ఈ దాడిలో దాదావల్లి ఎడమచేతిపై, కాళ్లపై గాయాలు కాగా దవడ పళ్లు కదిలిపోయాయని, కుమారుడికి, భార్యకు గాయాలైనట్లు వివరించారు. చికిత్స నిమిత్తం వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి స్థానికులు తరలించారు. ఈ మేరకు మదనపల్లె తాలుకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, పోలీసులు విచారించి న్యాయం చేస్తామని తెలిపినట్లు బాధితులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విషద్రావణం తాగి యువకుడు ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం నిమ్మనపల్లె మండలంలో చోటుచేసుకుంది. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం నిమ్మనపల్లె మండలం పిట్టావాండ్లపల్లెకు చెందిన హరీష్ విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఎందుకు ఆత్మహత్యకు ప్రయత్నించాడో ఆ వివరాలు తెలియాల్సి ఉంది.

పేకాటరాయుళ్ల అరెస్టు

ముద్దనూరు, అక్టోబర్ 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనాపురం సమీపంలోని కొండప్రాంతంలో ఉన్న కంపచెట్లలో ఆదివారం పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.10,250 నగదు స్వాధీనం చేసుకుని ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి

- నలుగురిపై కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని శంకరాపురానికి చెందిన అంజన గిరిబాబుపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. అంజని గిరిబాబు ఆర్టీసీ బస్టాండు సమీపంలో నడుచుకుంటూ వెళుతుండగా మృత్యుంజయకుంటకు చెందిన మధు తన స్నేహితులతో కలిసి ఎదురుగా వెళ్లి గిరిని ఢీకొట్టాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో మధు అతని స్నేహితులు కలిసి గిరి తలపై బాదారు. దీంతో గిరి తలకు గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి..?

చక్రాయపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డంవారిపల్లె సమీపాన నక్కలదిన్నెపల్లెకు చెందిన ప్రతాపరెడ్డి (55) తేనెటీగల దాడిలో మృతి చెందాడని ఆయన కుమారుడు నవీన్‌కుమార్‌రెడ్డి పోలీసులు ఫిర్యాదు చేశారు. ఆ వివరాల్లోకి వెళితే... ప్రతాపరెడ్డి, మరికొందరు శనివారం గడ్డంవారిపల్లె సమీపంలోని తెల్లగొండ నారవలో కొయ్యలకు వెళ్లారు. కొయ్యలు కొట్టుకుంటుండగా తేనెటీగలు దాడి చేయడంతో ప్రతాపరెడ్డి మృతి చెందినట్లు కథ అల్లారు. చివరికి గ్రామంలో పుకార్లు చెలరేగాయి. తేనెటీగలు కాదు గుప్తనిధుల కోసం వెళ్లి ఏం జరిగిందో ఏమో ప్రతాపరెడ్డి మృతి చెందాడు. పోలీసులు మాత్రం ఎక్కడ గాయాలు లేవని తెలిపారు. ప్రతాప్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పోస్టుమార్టం రాగానే కేసునమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ప్రతాపరెడ్డి మృతిపై పలు అనుమానాలు వస్తున్నట్లు సమాచారం.

వృద్ధురాలిపై దాడి

- బంగారు గొలుసు అపహరణ



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న లక్ష్మీనరసమ్మ

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిట్వేలి రోడ్డులో నివసిస్తున్న లక్ష్మీనరసమ్మ అనే వృద్ధురాలు ఆదివారం సాయంత్రం బయనపల్లి రహదారిలోని ఒక ప్రైవేట్ పాఠశాల సమీపంలో ఉన్న చెరువు కట్టపై వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి మోటార్ బైకుపై వచ్చి ఆమెపై దాడి చేసి, మెడలో ఉన్న 33 గ్రాముల బంగారు గొలుసును దొంగిలించి పారిపోయాడు. రోడ్డుపై పడిపోయిన ఆమెను గుర్తించిన స్థానికులు వారి బంధువులకు సమాచారం అందించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి వెంటనే సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి విచారాణ చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు, కొత్త వ్యక్తులపై సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

డిసెంబరులోగా జిల్లాను ప్రకటించాలి

- జిల్లా సాధన సమితి డిమాండ్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పీటీఎం శివప్రసాద్

పీలేరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డిసెంబరులోగా మదనపల్లె జిల్లా ఏర్పాటును ప్రకటించాలని పలు ప్రజా, ఉద్యోగ, కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. మదనపల్లె జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో 'మదనపల్లె జిల్లా-దశాబ్దాల కల' పేరిట ఆదివారం పీలేరులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీసీకే-బాస్ నేత, జిల్లా సాధన సమితి కన్వీనర్ పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు మదనపల్లెను జిల్లాగా చేస్తామని చంద్రబాబునాయుడు, నారా లోకేశ్ హామీ ఇవ్వడాన్ని గుర్తు చేశారు. వారు అధికారంలోకి వచ్చి పదహారు నెలలు గడుస్తున్నా హామీ నెరవేరే సూచనలు కనిపించకపోవడంతో మరోమారు ఉద్యమానికి పూనుకున్నామన్నారు. మదనపల్లెను జిల్లాగా చేయాలని గతంలోనూ 633 రోజులు ఉద్యమించి అప్పటి కలెక్టరుకు 2526 వినతిపత్రాలు అందించామని తెలిపారు. అమరావతిలోని రాజధాని రైతుల ఉద్యమం తరువాత సుదీర్ఘంగా సాగిన ఉద్యమం మదనపల్లె జిల్లా సాధనే అన్నారు. ఈ ఉద్యమంలో సామాన్యులను సైతం భాగస్వామ్యుల్ని చేసేందుకు ఆదివారం ఒక్కరోజే ఏకకాలంలో బి.కొత్తకోట, పుంగనూరు, మదనపల్లె, పీలేరు పట్టణాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. మదనపల్లె జిల్లా ఆవశ్యకతను వివరించి సామాన్య ప్రజల దగ్గర నుంచి ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, మహిళలు, మేధావులను ఐక్యం చేసి ఉద్యమిస్తామన్నారు. వచ్చే ఏడాదిలో జనగణన ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించిందని, అంతే కాకుండా ఈ ఏడాది చివరిలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్, ఆ తరువాత ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అవుతుందని, అందుకనే తాము ఈ ఏడాది డిసెంబరులోగా జిల్లా ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. మదనపల్లెను జిల్లాగా ఏర్పాటు చేసే సమయంలోనే పీలేరును ఆర్డీవో కేంద్రంగా ప్రకటించాలని కోరారు. విద్య, వైద్య, ఉపాధి, వ్యాపార రంగాల్లో ఇప్పటికే పట్టణ స్థాయిని చేరుకున్న పీలేరుకు గతంలోనే ఆర్డీవో కేంద్రం చేయాల్సి ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. విశ్రాంత అధ్యాపకుడు చంద్రయ్య మదనపల్లె ప్రాంత చరిత్ర, సాంస్కృతిక, వ్యాపార, విద్య, ఉపాధి, రాజకీయ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో బాస్ నేత పాలకుంట శ్రీనివాసులు, పలు సంఘాల నేతలు సుధాకర్, ధరణి, షరీఫ్, శ్రీకాంత్, టీఎల్ వెంకటేశ్, ముల్లంగి చంద్రయ్య, లక్ష్మీనారాయణ, బద్దె భాను, మలతోటి నరేశ్, గట్టప్ప, కిల్లా విజయ్‌కుమార్, వెంకటస్వామి, గురునాథ తదితరులు పాల్గొన్నారు.

'విద్యారంగానికి ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది'

రాయచోటిటౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం పాటు విద్యారంగానికి సేవలందించిన ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన, ఇటీవల పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయుల ఆత్మీయ అభినందన సన్మానసభను ఎస్టీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ పౌరులను అందించే ఉపాధ్యాయులు దీపపు స్తంభాల్లాంటి వారన్నారు. అటువంటి ఉపాధ్యాయ వృత్తి మిగిలిన అన్ని వృత్తుల కంటి ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. అనంతరం రాయచోటి రీజన్‌లో పదవీ విరమణ చెందిన జాతీయ, రాష్ట్ర అవార్డు పొందిన 65మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం, ఉపవిద్యాశాఖ అధికారి నాగయ్య, డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, హెచ్‌ఎమ్స్ అసోసియేషన్ నాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

మంగంపేట వద్ద రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి.. ఇరువురికి గాయాలు

ఒంటిమిట్ట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగంపేట ఆంజనేయస్వామి గుడి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వివాహిత మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మలకాటిపల్లె గ్రామానికి చెందిన శివారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సాయంత్రం నందలూరు మండలం నల్లతిమ్మాయపల్లెకు తన వాహనంలో బయలుదేరారు. సరిగ్గా మంగంపేట ఆంజనేయస్వామి గుడి సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో శివారెడ్డి భార్య రేణుక(40) సంఘటన స్థలంలోనే మృతి చెందారు. శివారెడ్డి, మరో మహిళ వెంకటలక్షుమ్మకు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'కల్తీ' కేసులో ఎవరున్నా శిక్ష తప్పదు

- జనసేన ఇన్‌చార్జి పోతుల సాయినాథ్



సమావేశంలో మాట్లాడుతున్న పోతుల సాయినాథ్

ములకలచెరువు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం కేసులో ఎంతటి వారున్నా శిక్ష తప్పదని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ములకలచెరువులో కల్తీ మద్యం తయారీ జరగడం ఒక్కసారిగా రాష్ట్రాన్ని కుదిపివేసిందన్నారు. కొందరు నేతలు కల్తీ మద్యం తయారు చేసి ప్రజల ప్రాణాల మీదకు తేవడం బాధాకరమన్నారు. సమావేశంలో నేతలు సుదర్శన్, షోరూం సూరి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఉపేక్షించదు

తంబళ్లపల్లె, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం తయారీ కేసులో తప్పు ఎవరిదున్నా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, కఠిన చర్యలు తీసుకుంటుందని టీడీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి నాంది రెడ్డప్ప ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ములకలచెరువులో కల్తీ మద్యం తయారీని తీవ్రంగా ఖండించారు. కల్తీ మద్యం తయారు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆ ప్రకటనలో కోరారు.

ఇది ప్రభుత్వ స్థలం.. బోర్డులు ఏర్పాటు చేస్తాం : తహసీల్దార్

మదనపల్లె అర్బన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఇది ప్రభుత్వ స్థలమని, ఇందులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని ఆదివారం తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ సచివాలయం సమీపంలో ఆదివారం ఎక్స్‌కవేటర్లతో భూమిని చదును చేస్తున్నట్లు, ఇరువర్గాలకు ఘర్షణ జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి తహసీల్దార్ అక్కడి వెళ్లి భూమిని పరిశీలించారు. 2004లోనే ప్రభుత్వ భూమిగా స్వాధీనం చేసుకున్నట్లు రికార్డులో ఉండడంతో వలిపి కుటుంబ సభ్యులకు ఎలాంటి హక్కులు లేవని, ఈ స్థలంలో కంపచెట్లు, పొదలతో నిండి ఉందన్నారు. ఈ భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించి ఇక్కడ హెచ్చరిక బోర్డులు నాటిస్తున్నట్లు తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వీర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.



భూ రికార్డులు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



చదును చేస్తున్న ప్రభుత్వ భూమి



తహసీల్దార్‌కు రికార్డులు చూపుతున్న బాధితులు